క్లుప్తంగా

కలెక్టర్‌కు పుస్తకం, సిరాపెన్ను బహూకరణ



పుస్తకం, పెన్ను అందజేస్తున్న ఎంఈఓ

కొత్తగూడెంఅర్బన్: కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు తాను రచించిన 'ఆదర్శప్రాయులు' పుస్తకాన్ని, 1932లో రాజమండ్రిలో స్థాపించబడిన రత్నం అండ్ కంపెనీ తయారు చేసిన ప్రత్యేక సాంప్రదాయ సిరాపెన్నును శుక్రవారం కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ అందజేశారు. జిల్లా విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు గుర్తింపును తీసుకొచ్చారన్నారు.

సర్వేయర్ శిక్షణలో వర్గీకరణ అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న జోగారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ల్యాండ్ సర్వేయర్ శిక్షణ ఎంపికలో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ అమలు చేయాలని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని ఏఓ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలి



వ్యాపారులకు నోటీసులు ఇస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ సముదాయంలో ప్లాస్టిక్‌ను నిషేధించడం జరిగిందని ప్లాస్టిక్ వస్తువులను విక్రయించొద్దని, వాడకాన్ని వారించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం ఆలయ ఈఓ జారీచేసిన నోటీసులను ఆలయకమిటీ చైర్మన్ నాగేశ్వరరావు వ్యాపారులకు అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పెండ్లి రాంరెడ్డి, పాపారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి వనరుల వృద్ధికి సహకరించండి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇల్లెందురూరల్: సాగునీటి వనరుల వృద్ధికి సహకరించాలని కోరుతూ మండలంలోని పూసపల్లి గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఆవిర్భావం జరిగిన పూసపల్లి గ్రామం నేటికీ అసౌకర్యాలకు నిలయంగా ఉందని, ఉపాధి వనరులు లేక సాగునీటి వనరులు దరిచేరక అరకొర వ్యవసాయంతో నిత్యం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఓసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పూసపల్లి వాసులకు అవకాశం కల్పించాలని, సింగరేణి ఏరియా వైద్యశాలలో పూసపల్లి గ్రామస్తులకు ఉచిత వైద్యసౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్నపాక సత్యనారాయణ, రామారావు, కృష్ణ, అరవింద్, రాంబాబు, సూరయ్య, వెంకట్, పుల్లయ్య, పాపయ్య, వెంకటమ్మ, బాల పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పాల్వంచరూరల్: బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లి ప్రచారం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు రాపాక రమేష్ కార్యకర్తలను కోరారు. స్థానిక వికలాంగుల కాలనీలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయిన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణ నూతన కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా తోకల నర్సుదాసు, ముత్తబోయిన మహేష్, కేతినేని సావిత్రి, తాడికొండ కళ్యాణ్, ప్రధాన కార్యదర్శులు చామకూరి సాయివంశీ, కల్లోజు నాగరాజు, కార్యదర్శులుగా వీరన్న, రామిశెట్టి రాజేశ్వరీ, గడ్డం కావ్య, మార్గంపుడి సుభాష్, కోశాధికారి జి.చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

నీడనిచ్చే వాటికే.. నీడనిస్తూ..

చలువ పందిళ్లతో మొక్కలకు రక్షణ

- ఎండ నివారణకు గ్రీన్‌నెట్లు ఏర్పాటు
- ఎప్పటికప్పుడు నీటి తడులు
- ఒక్కో నర్సరీలో 2 లక్షల మొక్కలు



మొక్కలకు నీడ కోసం ఏర్పాటుచేసిన గ్రీన్‌నెట్

చుంచుపల్లి: అటవీశాఖ ఆధ్వర్యంలో వచ్చే జూలైలో చేపట్టనున్న వనమహోత్సవానికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ప్రతీ గ్రామానికి ఒక నర్సరీని ఏర్పాటు చేసి హరిత నర్సరీల్లో మొక్కలను పెంచే బాధ్యతలను ఆయా పంచాయతీలకే అప్పగించారు. ప్రతీ నర్సరీలో పది వేల మొక్కలను సిద్ధం చేయాలని అధికారులు ముందే నిర్దేశించుకుని పెంచుతున్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రధాన రహదారుల పక్కన, చెరువు కట్టలపై, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నాటడానికి అనువైన మొక్కలను సిద్ధం చేస్తున్నారు. అయితే వేసవి దృష్ట్యా ఎండలు మండిపోతున్న నేపథ్యంలో మొక్కలను రక్షించేందుకు అధికారులు తగిన జాగ్రత్తలు చేపట్టారు. నర్సరీల్లో మొక్కలు అధిక ఉష్ణోగ్రతలకు వాడిపోకుండా, చనిపోకుండా రక్షణగా నీడ సౌకర్యం కల్పించారు. హరిత నర్సరీల్లో మొక్కలను తగిన నీడ కోసం గ్రీన్‌నెట్‌లను ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లను ఏర్పాటు చేసి మొక్కలకు తరుచూ నీటి తడులు పెడుతున్నారు. ఉపాధి కూలీలు ఎప్పటికప్పుడు దగ్గరుండి మొక్కల పెరుగుదలను పర్యవేక్షిస్తున్నారు. చుంచుపల్లి మండలంలో 18 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో ఈ మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఒక్కో నర్సరీలో 10 వేల చొప్పున సుమారు 2 లక్షల వరకు మొక్కలను వన మహోత్సవానికి అందించనున్నారు. తొలకరి వర్షాలు ఆరంభం కాగానే జూలైలో మొక్కలను నాటేందుకు అనువుగా పెంచుతున్నారు.

ఎండల రక్షణకు చర్యలు ఇలా..



- హరిత నర్సరీల్లో నాటిన ప్రతీ విత్తనం మొలకెత్తడానికి, తరువాత మొక్కను ఎండల నుంచి రక్షించడానికి అధికారులు, ఉపాధి సిబ్బంది ఎప్పటికప్పుడు నీటి తడులు పెడుతూ తగిన చర్యలు తీసుకుంటున్నారు.
- పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో టేకు, వెదురు, దానిమ్మ, ఆకాశ మల్లి, నిమ్మ, జామ, సీతాఫలం, బొప్పాయి, కర్జూరం, నిద్ర గన్నేరు, మల్బర్ వేప, గానుగ, వేప, కదంబ, గుల్‌మొహర్, మారేడు, స్పాంథోడియా, కరివేపాకు, గోరింట, ఉసిరి, చింత, రేగు, ఈత, నేరేడు వంటి 20 రకాలకు పైగా మొక్కలు పెంచుతున్నారు.
- ఇప్పటికే పెరిగిన కొన్ని రకాల మొక్కల కొమ్మలను కత్తిరించి నాటుతున్నారు. మొక్కలు బలంగా ఉండేందుకు నర్సరీల్లో కూలీలు తరచూ కలుపుతీస్తున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను పెద్ద కవర్లలోకి మారుస్తున్నారు. అక్కడక్కడా చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ కొత్తగా కొత్త కొమ్మలను నాటుతున్నారు.
- ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ఎండలు తీవ్రమయ్యాయి. దీంతో నర్సరీల్లో చిన్నగా ఉన్న మొక్కలు వాడిపోకుండా నీడ కోసం ఉపాధి అధికారులు, పంచాయతీ సిబ్బంది గ్రీన్ నెట్ వలలు ఏర్పాటు చేశారు.
- నర్సరీల్లోని మొక్కలకు తరచూ నీటి తడులు అందిస్తున్నారు. దీంతో మండే వేసవిలో మొక్కలు వాడిపోకుండా ఉంటాయని అధికారులు అంటున్నారు. మొక్కల పెంచే సంచులకు చదలు పట్టకుండా గెమాగ్జిన్ పౌడర్ వంటివి చల్లిస్తూ నిత్యం హరిత నర్సరీలను పర్యవేక్షణ చేస్తున్నారు.

నిరంతరం పర్యవేక్షణ



వచ్చే వన మహోత్సవానికి గతేడాది నవంబర్ నుంచి హరిత నర్సరీలలో మొక్కలు పెంచే పనులకు శ్రీకారం చుట్టాం. పంచాయతీల పర్యవేక్షణలో నర్సరీల్లో మొక్కలు ఉత్పత్తి చేస్తాం. ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు పెంచుతున్నాం. పూల మొక్కలతో పాటు నీడ నిచ్చే మొక్కలు కూడా ఉన్నాయి. ప్రతి రోజూ హరిత నర్సరీల్లో పనులను పర్యవేక్షిస్తున్నాం. దీనికి నర్సరీకి ముగ్గురు, నలుగురు ఉపాధి కూలీల సేవలను వినియోగిస్తున్నాం.

– నాగరాజు, ఉపాధి సిబ్బంది

18 గ్రామాల్లో మొక్కల పెంపకం



మండలంలోని 18 గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత నర్సరీల్లో సుమారు 2 లక్షల మొక్కలు సజావుగా ఉత్పత్తి కావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎండల నేపథ్యంలో నర్సరీల్లో మొక్కలు వాడిపోకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. పిచ్చిమొక్కలను తొలగిస్తూ కలుపు తీయిస్తున్నాం. వేసవి ఎండల దృష్ట్యా ఎప్పటికప్పుడు నీటి తడులు అందిస్తున్నాం.

– సుభాషిని, ఎంపీడీఓ, చుంచుపల్లి

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచరూరల్: కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని పునుకుల, కిన్నెరసాని గ్రామాల్లో ఎమ్మెల్యే శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలో రూ.2.65 కోట్ల వ్యయం గల అభివృద్ధి పనులకు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేర్చడమే లక్ష్యంగా పనిచేసి ఆదర్శ నియోజకవర్గంగా నిలిపేందుకు ప్రతీ చిన్న అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటామన్నారు. గ్రామాల్లో, వార్డుల్లో డ్రెయినేజీలు, రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ వికాస్ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు చోటులేకుండా అధికారులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ దారాప్రసాద్, పీఆర్‌డీఈ రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, మండల, పట్టణ కార్యదర్శులు వినంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, యర్రంశెట్టి ముత్తయ్య, కనగాల అనంతరాములు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, గుండాల నాగరాజు, కొంగర అప్పారావు, ఆవుల మధు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థే..

కొత్తగూడెంఅర్బన్: ప్రతీ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉండాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం భారత్ పబ్లిక్ స్కూల్ నందు జరుగుతున్న ఆంగ్ల ఉపాధ్యాయుల వృత్యంతర కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కోర్సు డైరెక్టర్ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, రిసోర్స్ పర్సన్‌లు సైదులు, మీరా హుస్సేన్, మురళి, జానకి, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 3 ఇంక్లైన్ లారీ యూనియన్ ఆఫీసులో శుక్రవారం లారీ డ్రైవర్లతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతగా మెలగాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దని, నిద్రలేమితో వాహనాలను నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు వారి వాహనాల ఇంజన్లు, టైర్లు చూసుకోవాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వ్యక్తులను, వాహనాలను చట్ట ప్రకారం కోర్టుకు తరలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, టూటౌన్ ఎస్సై కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో మేలు..



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

టేకులపల్లి: పచ్చిరొట్టతో పంటలు సాగుచేస్తే నేలతల్లికి మేలు జరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, ఇల్లెందు ఏడీఏ జి.లాల్‌చంద్ అన్నారు. ఈ మేరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు– రైతు అవగాహన కార్యక్రమంలో భాగంగా కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల బృందం మండలంలోని కోయగూడెం గ్రామంలో పర్యటించారు. అనంతరం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లోని రైతువేదికలో జరిగిన రైతు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ.. వానాకాలం పంటల సాగుకు ముందుగా పచ్చిరొట్ట పంటలను సాగు చేసి పంట పుష్పించే దశకు చేరిన తరువాత పంటను భూమిలో కలియదున్నితే తర్వాత వేసే పంటల్లో 30 శాతం వరకు నత్రజని వాడకాన్ని తగ్గించుకోవచ్చన్నారు. రైతులు అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటలైన ఆయిల్‌పాం, మునగ, వెదురు లాంటి పంటలను పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త శివ, టేకులపల్లి ఏవో అన్నపూర్ణ, హెచ్‌ఓ స్రవంతి, ఏఈవో జె.శ్రావణి, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

'సంబంధం లేని వారితోనే రసాభాస'



మాట్లాడుతున్న శౌరి

కొత్తగూడెంఅర్బన్: కాంగ్రెస్‌లో కొనసాగుతున్న కొందరు ఇంకో పార్టీకి కోవర్టుల్లా వ్యవహరిస్తున్నారని టీపీసీసీ సభ్యుడు జే.బీ.శౌరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగూడెంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈనెల 21న జరిగిన సమావేశంలో కొందరు సంబంధం లేని వ్యక్తులు రసాభాస సృష్టించాలని యత్నించారని, పార్టీ నాయకత్వాన్ని దుయ్యబట్టారని పేర్కొన్నారు. ఈ విషయం అధిష్టానం దృష్టికి వెళ్లినందున, వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆది నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న శ్రేణులను అవమానిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్, నాయకులు బిక్షపతి, తెలకపల్లి లక్ష్మయ్య, దావూద్, ఎలకపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రాములు నాయక్

జూలూరుపాడు: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ, ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో జూన్ 9న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రాములు నాయక్ పిలుపునిచ్చారు. జూలూరుపాడు కేజీబీవీలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, డీఏ, పీఆర్‌సీ బకాయిల చెల్లింపులో జాప్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీను, జిల్లా అధ్యక్షుడు మోహన్ రాథోడ్, మండల అధ్యక్షుడు గుగులోత్ సీతారాములు, ప్రధాన కార్యదర్శి ధరావత్ హనుమా జాదవ్, గోపాల్, భాస్కర్, పెంటయ్య, స్వరూప, అరుణ, సునీత పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



అక్రమ కట్టడాన్ని కూల్చేస్తున్న సిబ్బంది

చుంచుపల్లి: లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగు, మోకాళ్ల గుంపు సమీపంలోని అక్రమ నిర్మాణాలను ఫారెస్ట్ డివిజనల్ అధికారి ఆదేశాలతో శుక్రవారం సిబ్బంది కూల్చేశారు. సర్వే నంబర్ 17 ఫారెస్ట్ పరిధిలో ఉండటంతో గతంలో అధికారులు నోటీసు ఇచ్చినా సంబంధిత నిర్మాణదారులు వాటిని లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలు జరుపుతుండటంతో నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ... ఫారెస్ట్ పరిధిలో ఉన్న భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రజతోత్సవాలను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: ఈనెల 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్న తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవాలకు జర్నలిస్టులు తరలివచ్చి విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రజతోత్సవ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.షఫీ, సహాయ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సాక్షి జిల్లా బ్యూరో కృష్ణ గోవింద్, చంద్ర నర్సింహారావు, శ్రీనివాసరావు, పి.వెంకటనారాయణ, వేముల కొండలరావు,తోట రామకృష్ణ, రజాక్, అల్లాడ రమేష్, మస్నా శ్రీను, కొప్పుల రవీందర్, పుల్లారావు, మహేష్ పాల్గొన్నారు.

న్యాయ విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఇల్లెందు: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో అబూజ్‌మడ్‌లో హత్యాకాండ కొనసాగుతోందని, తక్షణం నరమేధాన్ని నిలిపివేయాలని, హత్యాకాండపై సమగ్ర విచారణ జరిపించాలని ఎన్డీ జిల్లా సహాయకార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇల్లెందులో ఎన్డీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును అత్యంత దారుణంగా హతమార్చిన పోలీసులు అమాయక ఆదివాసీ ప్రజలను హతమారుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సారంగపాణీ, నాగేశ్వరరావు, మోకాళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'క్షయ' అంతానికి కృషి

టేకులపల్లి: క్షయ వ్యాధి అంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోడానికి దాతలు చేయూతనివ్వాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కంచర్ల వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం గ్రాన్యూల్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన అక్షయపాత్ర కార్యక్రమం ద్వారా పంపించిన న్యూట్రిషనల్ కిట్లను వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశారు. మండలంలో క్షయ వ్యాధికి మందులు వాడుతున్న 40 మంది రోగులకు 3 కేజీల బియ్యం, 2 కేజీల కంది పప్పు, కేజీ పల్లీలు, అర కిలో నూనెతో కూడిన కిట్లను రోగులకు అందజేశారు. ఇల్లెందు డివిజన్ క్షయ యూనిట్ అధికారి శంకర్, సూపర్వైజర్ నాగుబండి వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న సంస్థ సభ్యులు

విద్యార్థినికి మంత్రి అభినందన



అభినందిస్తున్న మంత్రి పొంగులేటి

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 996 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన కొత్తగూడెం కృష్ణవేణి కళాశాల విద్యార్థిని కె.హాసినిని శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా శోభాయాత్ర



ర్యాలీలో భక్తులు

ఇల్లెందు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి రాధాకృష్ణ, రమేష్, చక్రధర్, మదుబాబు, నగేష్‌కుమార్, వ్యామసాని జనార్దన్ రాజశేఖర్, సతీష్‌కుమార్, అను, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

పాల్వంచరూరల్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలకు అరికట్టి అర్హులకు న్యాయం చేయాలని టీడీపీ నాయకుడు కనగాల అనంత రాములు కోరారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో అనర్హులకు ఇళ్లు మంజూరు చేసేలా కమిటీ సభ్యులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇకనైనా జాబితాలు ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించాలని, తద్వారా అర్హులకే ఇళ్లు దక్కుతాయని చెప్పారు. అలాగే, మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కూడా నాణ్యతపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జరపన సీతారాంబాబు, సుధాకర్, రేగళ్ల శ్రీనివాసరావు, బత్తిన దుర్గారావు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు వైరాలో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళాపై ప్రచారం చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం వైరా ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో సింగరేణి కాలరీస్ సహకారంతో మెగా జాబ్‌మేళా జరగనుంది. ఈ జాబ్‌మేళాను విజయవంతం చేసేందుకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జాబ్‌మేళాకు నిరుద్యోగులను తరలివెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు.

డయల్ యువర్ డీఎం

చుంచుపల్లి: కొత్తగూడెం, ఇల్లెందు పట్టణ పరిసర ప్రాంతాల ఆర్టీసీ ప్రయాణికులకు సమస్యల పరిష్కారానిక శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూచనలు, సలహాలు, ఫిర్యాదుల కోసం 9959225959 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన..

టేకులపల్లి: ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం టేకులపల్లి మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొమ్మనపల్లి– మంగ్యతండా మధ్యలో రూ.45లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించి, గోలియాతండాలో నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. బేతంపూడి సొసైటీ కార్యాలయంలో సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.